డీడీ పోస్టా.. మజాకా!

అమాత్యులతో పైరవీలు

పాడేరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే పెద్దదైన పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమశాఖ డీడీ(ఉప సంచాలకులు) పోస్టును దక్కించుకునేందుకు పెద్దఎత్తున పైరవీలు జరుగుతున్నాయి. పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల్లో 120కి పైగా ఆశ్రమాల్లో చదువుతున్న 50 వేల మంది విద్యార్థుల సంక్షేమాన్ని పర్యవేక్షించే ఈ కీలక పోస్టును దక్కించుకోవాలని కొంతమంది ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కనీసం ఇన్‌ఛార్జి బాధ్యతలైనా కొన్నాళ్లపాటు తమకు ఇప్పించాలని అమాత్యుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడం గమనార్హం. ఇక్కడ డీడీగా పనిచేసిన కొండలరావుపై గిరిజన సంఘాల నుంచి ఫిర్యాదులు, అభియోగాలు రావడంతో కలెక్టర్ దినేష్‌కుమార్ ఈయన్ను రంపచోడవరానికి బదిలీ చేశారు. ఈ బదిలీని నిలుపుదల చేసుకునేందుకు కొండలరావు విశ్వప్రయత్నాలు చేసినా స్థానిక ప్రజాప్రతినిధులు, సంఘాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రిలీవ్ కావాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇన్‌ఛార్జి డీడీగా పాడేరు ఏటీడబ్ల్యూవో రజని వ్యవహరిస్తున్నారు. ఈ పోస్టు కోసం కొంతమంది ఏటీడబ్ల్యూవోలు సైతం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో పనిచేసిన ఓ సూపరింటెండెంట్ రాష్ట్రస్థాయిలో పైరవీలు చేపట్టి కొద్ది రోజుల ముందు ఈ కార్యాలయంలో వచ్చి చేరారని తెలిసింది. ఈయన కోసం అప్పటికే ఈ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తిని పక్కనే ఉన్న ఐటీడీఏ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపించారు. దీనిపై గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ డిప్యూటేషన్ వెంటనే నిలిపేయాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్ చేస్తున్నారు.



పాడేరులోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం



రహదారిలో బండరాళ్ల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కురిడి సమీపాన జాతీయ రహదారిలో వర్షాలతో బండరాళ్లు జారి పడటంపై 'ఈనాడు' లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు జారిపడిన బండరాళ్లను తొలగించారు. - డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

అన్నింట్లో రక్తదానం గొప్పది

ఎటపాక, న్యూస్‌టుడే: అన్ని దానాల్లో రక్తదానం చాలా గొప్పదని పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం కళాశాల విద్యార్థులు భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు కళాశాల యాజమాన్యాన్ని, విద్యార్థులను అభినందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ హతిరామ్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, పాల్గొన్న కళాశాల సిబ్బంది, వైద్యులు

పింజరికొండ వాగుపై వంతెన

స్పందనకు వందనం

అడ్డతీగల, న్యూస్‌టుడే: అడ్డతీగల మండలం పింజరికొండ గ్రామం వద్ద వాగుపై వంతెన నిర్మాణానికి అధికారులు రూ. 70 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ గ్రామానికి చెందిన పులగం మేరీజ్యోతి కాన్పు ఇటీవల ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. సెప్టెంబర్ 27న ఆమెను తల్లీబిడ్డ వాహనంలో స్వగ్రామానికి తరలించారు. గ్రామానికి ఆనుకుని కొండవాగు ప్రవహించడంతో వాహనం వాగు ఇవతల వరకు వెళ్లగలిగింది. అక్కడ నుంచి కుటుంబ సభ్యుల సాయంతో వాగు వెంబడి గ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యుల్లో ఒకరు బాలింతను, మరొకరు నవజాత శిశువును భుజాన ఎత్తుకుని వాగు దాటించారు. దీనిపై 'పుట్టింటి దారిలో బాలింతకు పుట్టెడు కష్టం' శీర్షికతో 'ఈనాడు' ప్రధాన పత్రికలో సెప్టెంబరు 28న కథనం ప్రచురితమైంది. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందించారు. సమస్యపై ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. గ్రామస్థులు వాగు దాటేందుకు వీలుగా ఆ గ్రామానికి రోప్‌వే వంతెన మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వర్షాలు తగ్గాక పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.



పుట్టింటి దారిలో బాలింతకు పుట్టెడు కష్టం!


అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం పింజరికొండ గ్రామానికి చెందిన పులగం మేరీజ్యోతి కాన్పు అనంతరం తన శిశువుతో పుట్టింటికి వెళ్లేందుకు సాహసం చేయాల్సి వచ్చింది. మేరీజ్యోతి ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చారు. శుక్రవారం డిశ్చార్జి కావడంతో తల్లీబిడ్డ వాహనంలో తల్లిగారి ఊరైన పింజరికొండకు బయలుదేరారు. మార్గమధ్యలో కొండవాగు ప్రవహిస్తుండటంతో వాహనం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో బాలింతను కుటుంబ సభ్యుల్లో ఒకరు భుజాలపైకి ఎక్కించుకోగా.. శిశువును మరొకరు ఎత్తుకొని నెమ్మదిగా వాగు ఆవతలి ఒడ్డుకు చేరుకున్నారు. - న్యూస్‌టుడే, అడ్డతీగల

'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

కలిసి నడుద్దాం.. మత్తును చిత్తుచేద్దాం!

ఈనాడు, పాడేరు - న్యూస్‌టుడే, పాడేరు/పట్టణం

అల్లూరి జిల్లా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగానికి అడ్డాగా ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో ఏపుగా గంజాయి తోటలు దర్శనమిస్తూ ఉండేవి. గత వైకాపా పాలనలో శాంతిభద్రతలపై పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో గంజాయి రవాణాదారులు, పెట్టుబడిదార్లే రాజ్యమేలేవారు. దేశంలోనే గంజాయికి అల్లూరి జిల్లా కేంద్ర స్థానంగా మారింది. ఇదంతా ఒకప్పటి మాట.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ వంద రోజుల్లో పరిస్థితులో పూర్తిగా మార్పులు సంభవించాయి. మాదకద్రవ్యాల రవాణా, వినియోగం నివారించే దిశగా ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈనెల రెండో తేదీన మాదకద్రవ్యాల నిరోధక దినం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం..



వంద రోజుల్లో మార్పులు

- టోల్ ఫ్రీ నంబరు: 9381123100 ఏర్పాటు
- 359 మంది పాత నేరస్థుల గుర్తింపు..
- 48 మందిపై పీడీయాక్టు అమలు
- సుమారు 50 కేసుల నమోదు
- జి.మాడుగులలో పనిచేసిన ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏకంగా గంజాయి కేసులో ఇరుక్కున్నారు.

దేశంలో అల్లూరి జిల్లా గంజాయి సాగుకు చిరునామాగా ఉండేది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడితనం ఎక్కువైంది. నల్లమందు, లిక్విడ్ గంజాయిని తయారు చేసే యంత్రాలను ఏర్పాటుచేసుకుని వేర్వేరు ప్రాంతాలకు తరలించేవారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో మాదకద్రవ్యాల వినియోగం భారీస్థాయికి చేరుకుంది. పోలీసు అధికారులు, సీఐ, ఎస్సై క్యాడర్ అధికారులు సైతం సరకు రవాణాకు పరోక్ష సహకారం అందించేవారు. మొక్కుబడిగా తోటలు ధ్వంసం చేయడం, ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని అనధికారికంగా వ్యాపారం విస్తరించేందుకు తమ వంతు సహకారం అందించేవారనే సమాచారం. ప్రధానంగా పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, గూడెంకొత్తవీధి మండలాలతో రంపచోడవరం డివిజన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో విస్తారంగా సాగు జరిగేదని గుర్తించారు.



చైతన్య ర్యాలీలో విద్యార్థులు

అనర్థాలెన్నో: గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల మెదడుపై తీవ్రంగా ప్రభావం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. దీని ఫలితంగా మతిస్థిమితం కోల్పోవడం, ఆలోచనాశక్తి మందగించడం, సమస్యలు పరిష్కరించే సామర్థ్యం తగ్గిపోవడం, వికారం, ఉద్రేకపు ప్రవర్తన, నిద్రలేమి, హృదయ స్పందన పెరగడం, తల తిరగడం, తలనొప్పి వంటి మార్పులు సంభవిస్తాయి.

వైకాపా పాలనలో మాదకద్రవ్యాలకు అడ్డాగా జిల్లా

హోంమంత్రి అనిత సారథ్యంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ అమిత్ బర్ధర్‌లు మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్నారు. సరకు రవాణాతో సంబంధం ఉన్నవారిని ఈ మూడు నెలల్లో కటకటాల్లోకి నెడుతున్నారు. ఇదే సమయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి సరకును స్వాధీనం చేసుకుంటున్నారు. పరివర్తన, ప్రేరణ వంటి వినూత్న కార్యక్రమాలతో గ్రామీణ యువతను సన్మార్గంలో నడిపిస్తున్నారు. చైతన్య సదస్సులు, ర్యాలీలు, వివిధ కళా ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా గ్రామీణుల్లో మార్పు తీసుకొస్తున్నారు.



మాదక ద్రవ్యాల వినియోగ రహిత జిల్లాగా మార్చుతామని ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ



మండల కేంద్రాల్లోని పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు గంజాయిని సరఫరా చేస్తున్న ఓ ముఠాను పోలీసులు పట్టుకున్నారు.

ప్రత్యామ్నాయ పంటలు.. ఉపాధి

గంజాయి సాగుతో జీవనం సాగించిన రైతులకు ప్రభుత్వం వేరే పంటల సాగుకు ప్రోత్సాహిస్తోంది. రాజ్‌మా, కాఫీ, మిరియాలు, నారింజ, సీతాఫలాలు సిల్వర్‌ఓక్, నేరేడు, ఇతర మొక్కలను అందించింది. 4500 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు ఆయా రైతులకు అందించారు. ఇదే కాకుండా ఉపాధి హామీ పనుల్లో ఆయా రైతులకు ప్రాధాన్యం ఇవ్వడం, బ్యాంకు రుణాలు వచ్చేలా చూస్తోంది. ఒకప్పుడు గంజాయి తోటలున్న గ్రామాల్లో సైతం ఇప్పుడు రాజ్‌మా, బంతిపూలు కాఫీ, మిరియాల పంటలు దర్శనమిస్తున్నాయి.

విధుల్లో ఇంత నిర్లక్ష్యమా?

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: 'మారేడుమిల్లిలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదు. కనీసం వారానికోసారి జరగాల్సిన 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమం చేపడుతున్న జాడలే కనిపించడం లేదు' అంటూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో తీవ్ర అలసత్వం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శిని తక్షణమే సస్పెండ్ చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. మారేడుమిల్లిలోని దొరలవీధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఓ ఇంటి వద్ద బకెట్లలో నీరు నిల్వ ఉండిపోవడం, వాటిలో దోమల గుడ్లు (లార్వా) విపరీతంగా ఉండటం గమనించారు. వెంటనే ఆయన డీపీఓకు ఫోన్ చేసి తక్షణమే పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికుల్లో కొందరు తమకు పింఛన్లు రావడం లేదని, ఇళ్లు లేవని చెప్పగా.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్పంచి కొండా జాకబ్, ఉప సర్పంచి వీరబాబు కలెక్టర్‌ను కోరారు. ఎంపీడీఓ వీరకిశోర్ పాల్గొన్నారు.



కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో డీపీవోకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

తాజంగికి మంచి రోజులు

- ★ 'ఈనాడు' కథనంతో కదలిక
- ★ కాలువ నిర్మాణానికి రూ.20 లక్షలు
- ★ తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదనలు



తాజంగి జలాశయం

చింతపల్లి, న్యూస్‌టుడే

తాజంగి జలాశయానికి మంచి రోజులు రానున్నాయి. చింతపల్లి మండలంలో తాజంగి పంచాయతీలో ఈ జలాశయం ఉంది. దశాబ్దాలుగా ఆధునికీకరణకు నోచక కుడి, ఎడమ కాలువలు మరమ్మతుకు గురై ఆయకట్టు చివరి భూములకు సాగునీరందడం లేదు. జలాశయంలో నీరున్నా, పొలాల మధ్యలో నుంచి పంట కాలువలు వెళ్తున్నా.. వరిసాగు చేయలేని దుస్థితి. 'పొలాల చుట్టూ నీరు.. పండని పైరు' శీర్షికన ఆగస్టు 30న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందించి కుడి కాలువ మరమ్మతుకు రూ.20 లక్షలు మంజూరు చేశారు.



'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

గత ప్రభుత్వం విస్మరించడంతో..

కాలువలను పునర్నిర్మించే విషయంలో వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. ప్రభుత్వ ప్రాధాన్యతా పనులంటూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణాలకు నిధులు వెచ్చించి సాగునీటి పథకాలను విస్మరించింది. జలవనరుల శాఖకు పైసా నిధులివ్వలేదు. ఫలితంగా దిగువ పొలాలకు నీరందక రైతులు సాగుకు దూరమవ్వాల్సి వచ్చింది.



కాలువలను పరిశీలిస్తున్న జలవనరుల శాఖ డీఈ నాగేశ్వరరావు, ఏఈఈ లోకేష్‌కుమార్

కలెక్టర్ ఆదేశాలతో..

జలాశయం తాజా పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించడంతో జలవనరుల శాఖ అధికారుల్లో కదలిక వచ్చింది. ఆ శాఖ పాడేరు డీఈఈ నాగేశ్వరరావు, చింతపల్లి ఏఈఈ లోకేష్‌కుమార్ ఇటీవల తాజంగి చేరుకుని జలాశయాన్ని పరిశీలించారు. నిర్వహణ లేకపోవడంతో కుడి, ఎడమ కాలువలు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. కుడికాలువ మరమ్మతుతో పాటు పునర్నిర్మాణానికి కలెక్టర్ రూ.20 లక్షలు విడుదల చేయడంతో పనులు చేసేందుకు సన్నద్ధమయ్యారు. 'ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలాశయం నిండుగా నీరు చేరినా నిల్వ ఉండని పరిస్థితి. ఎక్కడికక్కడ కాలువలకు గండ్లు పడటంతో నీరంతా వృథాగా పోతోంది. వరద ప్రభావంతో దెబ్బతిన్న కాలువల మరమ్మతుకు అదనంగా రూ.20 లక్షలు అవసరమని అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపామ'ని డీఈఈ నాగేశ్వరరావు చెప్పారు.

ముఖ్యమంత్రి ఆదేశాలతో బియ్యం పంపిణీ

కొయ్యూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో పీడీఎస్ లబ్ధిదారుల కష్టాలు గట్టెక్కాయి. మంప పంచాయతీ కేంద్రానికి ఆర్.దొడ్డవరం, టిటోరాళ్ల, పి.గంగవరం, గొడుగులమ్మబంద గ్రామాలు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ గ్రామాలకు చెందిన వారంతా పీడీఎస్ బియ్యం కోసం ప్రతినెలా కాలినడకన కొండలు దాటి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మంప ఎంపీటీసీ పూర్వ సభ్యుడు బి.శివరామరాజు చొరవతో సీపీఐ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సమస్యను వివరించారు. ఆయన ఆదేశాలతో ఆర్.దొడ్డవరంలో మంగళవారం గిరిజనులకు సీఎస్‌డీటీ ప్రశాంత్‌కుమార్, డీటీ అప్పన్న, వీఆర్వో పండయ్యలు బియ్యం పంపిణీ చేశారు.



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేతలు

పెంచిన పింఛన్లను సద్వినియోగం చేసుకోండి



వై.రామవరం మండలం దేవరమడుగుల గ్రామంలో దివ్యాంగునికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

వై.రామవరం, అడ్డతీగల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కోరారు. వై.రామవరం మండల కేంద్రంతోపాటు అడ్డతీగల మండలం రాయపల్లి గ్రామాల్లో మంగళవారం ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. యార్లగడ్డ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందించే గుడ్లను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని చెప్పారు. అనంతరం గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. నియోజకవర్గ తెదేపా పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసులు, భాజపా పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ బి.భారతి, వై.రామవరం మండల తెదేపా, జనసేన నాయకులు రమణారెడ్డి, శ్రీకాంత్, శేఖర్, పుష్పరాజ్, రెడ్డి సత్యనారాయణ, ఎంపీడీఓ బాపన్నదొర, తహసీల్దారు అనసూయ, సీఐ నరసింహమూర్తి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





గిరి విద్యార్థికి బయో కెమిస్ట్రీలో డాక్టరేట్

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారుమూల గ్రామానికి చెందిన ఓ గిరిజన విద్యార్థి చదువులో అత్యున్నత ప్రతిభ కనబరిచి బయో కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ సొంతం చేసుకున్నారు. మారేడుమిల్లి మండలం పుల్లంగి గ్రామానికి చెందిన శశికాంత్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బయోకెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ రీసెర్చి స్కాలర్‌గా చేరారు. నియమిత గడువులోనే అంతర్జాతీయ స్థాయిలో మూడు ప్రచురణలు ఇచ్చి పీహెచ్‌డీ పూర్తి చేసి గౌరవ డాక్టరేట్ పట్టా పొందారు. శశికాంత్ తండ్రి గొర్లె సత్యచంద్ర ప్రసాద్ వ్యవసాయశాఖలో ఉద్యోగం చేసేవారు. తల్లి రత్నాబాయి గ్రంథాలయాధికారిగా పని చేస్తున్నారు.



డాక్టరేట్ స్వీకరిస్తున్న శశికాంత్

పాఠశాలలకు టాటా.. విద్యార్థుల ఇంటిబాట

✦ రేపట్నుంచి దసరా సెలవులు

చింతపల్లి గ్రామీణం, పాడేరు, న్యూస్‌టుడే : దసరా సెలవుల నేపథ్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ఈ నెల 3 నుంచి దసరా సెలవులు ఇస్తూ ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం గాంధీ జయంతి సెలవు కావడంతో గిరిజన ప్రాంతంలో విద్యార్థులు మంగళవారం మధ్యాహ్నం నుంచే ఇళ్లకు పయనమయ్యారు. తల్లిదండ్రులు వచ్చి వారిని తీసుకువెళ్లారు. పాడేరులో చదువుతున్న విద్యార్థుల కోసం తల్లిదండ్రులు రావడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడింది.

వై.రామవరం: మండలంలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు సోమవారం నుంచే ఇంటిదారి పట్టారు. మండల విద్యాశాఖాధికారి తాతబ్బాయిదొర దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం పాఠశాలలు నిర్వహించాల్సి ఉందన్నారు. విద్యార్థులను పాఠశాల సమయంలోనే ఇళ్లకు పంపడంపై ఉన్నతాధికారులకు విన్నవిస్తానని చెప్పారు.

మారేడుమిల్లి: దసరా సెలవుల సందడి మొదలవడంతో విద్యా సంస్థలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా స్వగ్రామాలకు పయనమయ్యారు. మారేడుమిల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల, గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల విద్యార్థులు స్వగ్రామాలకు ప్రయాణం కావడంతో సందడి నెలకొంది. మారేడుమిల్లి, బోదులూరు కూడళ్లలో రద్దీ ఏర్పడింది. విద్యార్థులను తీసుకుని వెళ్లడానికి వారి తల్లిదండ్రులు కూడా రావడంతో పండగ వాతావరణం కనిపించింది. ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుని తీసుకెళ్లారు.

గంగవరం: స్థానిక ఆశ్రమ బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు రావడంతో మండల కేంద్రం రద్దీగా మారింది. బస్సులు తక్కువగా ఉండటంతో ఇబ్బందులు తప్పలేదు. బస్సులు తిరగని ప్రాంతాలకు వెళ్లేవారు ప్రైవేట్ వాహనాలపై ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణాలు సాగించారు.


చింతపల్లిలో ఆశ్రమ పాఠశాలల నుంచి పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్తున్న తల్లిదండ్రులు


పాడేరులో బస్టాండులో రద్దీ


మారేడుమిల్లిలో..

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

వై.రామవరం, న్యూస్‌టుడే: రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. వై.రామవరం ఆసుపత్రిని మంగళవారం ఆమె సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ రాహుల్‌తో సమావేశమయ్యారు. వైద్యశాలలో ఉన్న మందులు, రోగుల స్థితిగతులపై ఆరా తీశారు. అవసరమైన సౌకర్యాలపై ఆరా తీశారు. రోగులకు సరిపడా మంచాలు, మరుగుదొడ్లు లేవని, సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వైద్యులు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను కలెక్టరు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈమె వెంట తెదేపా నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసు, భాజపా పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనరు బి.భారతి పాల్గొన్నారు.


వై.రామవరం ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రాష్ట్ర స్థాయి పోటీలకు నర్సింహపురం విద్యార్థులు

రాజవొమ్మంగి, చింతూరు, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి అల్లూరి సీతారామరాజు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన డి.సందీప్ కుమార్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని మండల విద్యాశాఖాధికారి కె.వి.వి.సత్యనారాయణ దొర తెలిపారు. కాకినాడలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో కబడ్డీ అండర్-17 బాలుర విభాగంలో ఈ విద్యార్థి సత్తాచాటాడు. పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఎం.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు డి.వి.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్‌బాబు, నాగరాజు, రేష్మ, ఉపాధ్యాయుడు బొజ్జియ్య తదితరులు పాల్గొన్నారు. నర్సింహపురం ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కట్టం వెంకటేష్, సవలం జంపన్న కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచారు. అండర్-14 ఖోఖో విభాగంలో వచ్చేనెలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు వీరిని ఎంపిక చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్‌తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.


ఎంపికైన విద్యార్థులు

వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

రంపచోడవరం, న్యూస్‌టుడే: కాకవాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కత్తుల మహాలక్ష్మి, పదో తరగతి చదువుతున్న మడి యోగిత వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటారు. స్వర్ణాంధ్ర-2047 అంశంపై జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి బహుమతులను కైవసం చేసుకొన్నారు. ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.రమణ, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు రమణ, ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి చెకుముకి పోటీలు 27న

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: చెకుముకి సంబరాల్లో భాగంగా పాడేరు డివిజన్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో డివిజన్‌లోని ఐదు పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు వై.పారయ్య తెలిపారు. ఏడు మండలాల నుంచి 147 మంది హాజరుకాగా వీరిలో అరకులోయ కేజీబీవీ, పెదబయలు, చింతపల్లి, పాడేరు, జి.మాడుగుల ఏపీఆర్ పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయికి అర్హత సాధించారన్నారు. ఈ విద్యార్థులు ఈనెల 27న నిర్వహించే పోటీలకు హాజరుకావాలని కోరారు.

రంపచోడవరం, కూనవరం, రాజవొమ్మంగి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రంపచోడవరం ఎంపీపీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి పోటీలు జరిగాయి. 11 పాఠశాలల నుంచి 33 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇర్లపల్లి ఆశ్రమ పాఠశాల, లెనోరా హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. కూనవరం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలకు కూనవరం, మర్రిగూడెం, రేపాక, విజయసాధన, మాంటిస్సోరి పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి సమీర, అభిషేక్, లావణ్య... ప్రైవేట్ పాఠశాలల నుంచి సౌజన్య, సచిన్, మహతి ప్రతిభ కనబరిచారు. రాజవొమ్మంగి మండలంలోని 11 ప్రాథమికోన్నత, ఉన్నత, ఆశ్రమ, గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకర్

చింతపల్లి, న్యూస్‌టుడే: గిరిజనులు పండించే మన్యం కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందని కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకర్ పేర్కొన్నారు. చింతపల్లిలో మంగళవారం కాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోర్డు విస్తరణ అధికారులు వేడుకలు నిర్వహించారు. ఐటీడీఏ కాఫీ విభాగం ఏడీ అశోక్ మాట్లాడుతూ.. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ రంగ సంస్థలకే కాఫీని విక్రయించాలని రైతులకు సూచించారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాలకు చెందిన కాఫీ రైతులు హాజరయ్యారు. విస్తరణ విభాగం జేఎల్ఓ ప్రదీప్‌కుమార్, ఉద్యాన అధికారి అరుణకుమారి, మాతోట, మ్యాక్స్ ప్రతినిధులు చిన్నారావు, గిరిప్రసాద్ పాల్గొన్నారు.


కాఫీ దినోత్సవ కార్యక్రమంలో రైతులు, అధికారులు

కేంద్ర మంత్రికి అరకు కాఫీ బహూకరణ

పాడేరు, న్యూస్‌టుడే: కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జ్యూయల్ ఓరం, ఆ శాఖ కార్యదర్శి విభు నయ్యర్‌ను పాడేరు ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ మంగళవారం ఝార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అరకు కాఫీ ప్యాకెట్లను వారికి బహూకరించారు. జన్‌మన్‌లో భాగంగా ఐటీడీఏ పరిధిలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతి, ఏకలవ్య మోడల్ పాఠశాలల భవన నిర్మాణాలను వివరించారు.


కేంద్ర మంత్రికి అరకు కాఫీని అందిస్తున్న పీఓ అభిషేక్

వాగుల వద్ద అప్రమత్తం

అడ్డతీగల: వాగుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం అన్నారు. అడ్డతీగల మండలం పింజరికొండలో మంగళవారం ఆయన పర్యటించారు. వాగు అవతల వైపు ఉన్న గ్రామస్థులతో మాట్లాడారు. ఇటీవల బాలింతరాలు ప్రమాదకర పరిస్థితుల్లో వాగు దాటి వెళ్లినతీరును గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. వాగు ఉద్ధృతి ఎక్కువగా ఉన్నప్పుడు రాకపోకలు అత్యంత ప్రమాదకరమని గ్రామస్థులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దారు సుబ్రహ్మణ్యాచారి, ఎంపీడీఓ రంగారావు, సీఐ నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

ఎటపాక, న్యూస్‌టుడే: గోదావరి నీటి మట్టం మంగళవారం నుంచి నెమ్మదిగా పెరుగుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో గోదావరి వరదలతో పంట భూములు నీటమునిగాయి. ఇటీవల నేల ఆరడంతో మిర్చి వేసేందుకు సిద్ధపడుతున్నారు. ఈ సమయంలో మళ్లీ నదిలో నీరు పెరుగుతుండటం సాగుదారులను కలవరపరుస్తోంది. ఎగువన భారీవర్షాలు లేనందున వరద ప్రభావం తక్కువగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెదగుమ్ములూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను తెదేపా నాయకుడు నవీన్‌రాజు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి ప్రారంభించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 15 నియోజకవర్గాల జట్లు పోటీల్లో తలపడ్డాయి. వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మల, శ్రీనివాసరావు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.


ఎలమంచిలి-అరకులోయ జట్ల మధ్య పోటీ

పరిహారం అందలేదంటూ మహిళల ఆందోళన

కూనవరం, న్యూస్‌టుడే: వరద ముంపు పరిహారం అందించాలని కోరుతూ కొందరు మహిళలు సోమవారం కూనవరం గ్రామ సచివాలయం ఎదుట ఆందోళనకు దిగారు. కొందరికి పరిహారాలు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. వివరాల నమోదు సమయంలో అధికారులు చేసిన తప్పుల వల్లనే పరిహారాలు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నాగబాబు మహిళలతో మాట్లాడారు. బాధితులకు అన్యాయం జరగదని, పూర్తి వివరాలు మరోసారి ఇస్తే వారికి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


కూనవరంలో ఆందోళన చేస్తున్న మహిళలు

ఆదివాసీ బాలల చదువుకు సహాయం

ఎటపాక, న్యూస్‌టుడే: మారుమూల వలస ఆదివాసీ గ్రామమైన జగ్గవరంలోని సుమారు 40 మంది విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి సరియం రాజులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సహాయం అందించారు. విస్సాపురం పంచాయతీలోని జగ్గవరం బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటుంది. ఇక్కడ సుమారు 40 మంది బడి ఈడు పిల్లలు ఉంటూ వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ రాజులు, ఉపాధ్యాయులు శేఖర్ తదితరులు వారందరూ చదువుకునేందుకు వీలుగా నల్లబల్ల, రాత పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు, బలపాలు, కుర్చీలు, చాపలు తదితర సామగ్రి సమకూర్చారు. డీఈఓ ఆదేశాలతో ఏకరూప దుస్తులు, బ్యాగు, బెల్ట్, బూట్లతో పాటు ఒక విద్యా వాలంటీర్‌ని ఏర్పాటు చేశారు. దీంతో ఉపాధ్యాయులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు శేఖర్, సత్యనారాయణ, పూరి కిరణ్‌కుమార్, ఎస్‌కే జహీదా బేగం, పూసం శ్రీను తదితరులు పాల్గొన్నారు.


జగ్గవరం వలస ఆదివాసీ పిల్లలతో ఎంఈఓ రాజులు, ఉపాధ్యాయ బృందం

తాగునీటి కుళాయి వాల్వ్‌కు తాళాలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేసే వాల్వ్ తమ స్థలంలో ఉందని అనంతగిరి మండలం గుమ్మ పంచాయతీ పరిధిలోని చిమిటి గ్రామానికి చెందిన వైకాపా వార్డు సభ్యుడి తండ్రి తాళాలు వేశారు. ఎంత మంది చెప్పినా తీయకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా ఆయన పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని తాగునీరు ఇప్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలంలోని సంజీవ్‌నగర్‌లో గంగాలమ్మ ఆలయ నిర్మాణానికి మంగళవారం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ రూ.20 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మండల తెదేపా, జనసేన అధ్యక్షులు జి.పెద్దిరాజు, బి.త్రిమూర్తులు, తెదేపా అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు డి.శివరామచంద్రరాజు, గ్రామపెద్దలు అప్పారావు, కేశవ్ పాల్గొన్నారు.



రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం

డుంబ్రిగుడ: గోరాపూర్ రోడ్డులో అడ్డంగా మంగళవారం ఉదయం భారీ వృక్షం నేలకొరిగింది. ఆంధ్రా-ఒడిశా ప్రధాన రహదారి కావడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. స్థానికుల సాయంతో గంటన్నర పాటు శ్రమించి వృక్షాన్ని తొలగించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

అల్లూరి కూడలిలో జాతీయ రహదారి విస్తరణ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో అల్లూరి కూడలి వద్ద 516-ఇ జాతీయ రహదారిని మరింత వెడల్పు చేయాలని నిర్ణయించారు. ఈ కూడలి వద్ద మలుపు ఉండటంతోపాటు వెడల్పు చాలా తక్కువగా ఉందని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతాయని ఆరోపిస్తూ సోమవారం రాత్రి గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, ఎమ్మెల్యే భర్త మఠం విజయ భాస్కర్ మంగళవారం ఘటనా ప్రదేశానికి చేరుకుని తహసీల్దార్ కె.సత్యనారాయణ, ఉప తహసీల్దార్ ఎ.సత్యనారాయణ, సీఐ ఎన్.సన్యాసినాయుడు, గ్రామ పెద్దలతో కలసి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ రహదారి విస్తరణలో గతంలో అధికారులు మార్కింగ్ ఇచ్చినంతమేర తొలగించలేదన్నారు. మలుపు వద్దకు వచ్చే సరికి రహదారి వెడల్పు మరీ తక్కువగా ఉందని తెలిపారు. దీంతో రెవెన్యూ అధికారులు, గుత్తేదారు సంస్థ సిబ్బంది, గ్రామపెద్దలు, గ్రామస్థులతో చర్చించారు. చివరకు అల్లూరి కూడలి వద్ద రెండువైపులా కొంత మేర పెంచి పనులు ప్రారంభించారు. అలానే కూడలి వద్ద డివైడర్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. కూడలి సమీపంలో రహదారికి రెండువైపులా డ్రైనేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో వర్షం పడినపుడల్లా మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల తెదేపా, జనసేన అధ్యక్షులు జి.పెద్దిరాజు, బి.త్రిమూర్తులు, తెదేపా అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు డి.శివరామచంద్రరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


రాజవొమ్మంగిలో విస్తరణ పనులను పరిశీలిస్తున్న నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు

బస్సు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

కూనవరం, న్యూస్‌టుడే: బస్సు నుంచి జారి కిందపడి వ్యక్తి ఒకరు మృతి చెందిన సంఘటన కూనవరం మండలం నర్సింగపేట సమీపంలో సోమవారం జరిగింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాదు నుంచి జగదల్‌పూర్‌కు వెళ్తోంది. బస్సు నర్సింగపేట సమీపిస్తుండగా అందులో ప్రయాణిస్తున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కొండాగామ్ జిల్లా సింగార్‌పురి గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ పండల్ (45) కిందకు దిగుతానని డ్రైవర్‌ను అడిగాడు. కొద్దిసేపటి తరవాత ఆపుతానని డ్రైవర్ చెప్పడంతో తలుపు సమీపంలో నిలుచున్నాడు. అకస్మాత్తుగా నిద్ర రావడంతో వేగంగా వెళుతున్న బస్సులో నుంచి కిందకు పడిపోయాడు. కింద పడిన మనోజ్‌పై నుంచి బస్సు వెళ్లడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. బస్సులోని వారు గమనించి డ్రైవర్‌కు విషయం చెప్పడంతో కిందకు వెళ్లిచూశారు. అప్పటికే తీవ్ర గాయాలతో ఉన్న ఆయనను కోతులగుట్ట వైద్యశాలకు తీసుకువచ్చారు. చికిత్స అందిస్తుండగా మనోజ్‌కుమార్ చనిపోయాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

పంచాయతీరాజ్ సిబ్బంది బదిలీ

పాడేరు, న్యూస్‌టుడే: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీల విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న విస్తరణ అధికారితో పాటు 26 మంది పంచాయతీ కార్యదర్శులను మార్చారు. అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్‌లో విస్తరణ అధికారిగా పనిచేస్తున్న ఎన్.జాన్‌మిల్టన్ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. అనపర్తి డివిజన్‌లో విస్తరణ అధికారిగా పనిచేస్తున్న కె.యు.ఆర్.ఎల్.పద్మజ అల్లూరి జిల్లాకు వస్తున్నారు. 26మంది పంచాయతీ కార్యదర్శులు ఉమ్మడి తూ.గో. జిల్లా నుంచి అల్లూరికి రానున్నారు. వీరంతా వారం రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఓటు నమోదు తప్పనిసరి

డుంబ్రిగుడ, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదు చేయించుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు పిలుపునిచ్చారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ఆధ్వర్యాన మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఓటరు నమోదు పత్రాలను ఉపాధ్యాయులకు అందజేశారు. నాయకులు సూరిబాబు, తీలి, పోతురాజు పాల్గొన్నారు. టోకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం స్వరూపారాణికి దరఖాస్తులను అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మొదటి గురువులు తల్లిదండ్రులే

గంగవరం: విద్యార్థులకు మొదటి గురువులు తల్లిదండ్రులేనని గంగవరం తహసీల్దార్ చిన్నం శ్రీనివారావు అన్నారు. కొత్తాడ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. దసరా సెలవుల్లో ఇళ్లకు వచ్చిన పిల్లపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమాజంలో ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ కారం నాగేశ్వరరావుదొర, పాతర రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ 30 శాతం నిధులు కేటాయించాలి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: చాపరాయి జలవిహారిలో వచ్చే ఆదాయాన్ని పంచాయతీకి 30 శాతం నిధులు కేటాయించాలని సర్పంచి వెంకటరావు, ఉప సర్పంచి జగ్గునాయుడు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఐటీడీఏ ద్వారా ఎకో టూరిజంతో చాపరాయి జలవిహారిని అభివృద్ధి చేశారన్నారు. ఎకో టూరిజానికే ఆదాయం సమకూరుతుందని, పంచాయతీకి నిధులు కేటాయించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పార్కింగ్ వసూలుకు పంచాయతీకి బాధ్యతలు అప్పగించాలని కోరుతూ కలెక్టర్‌ను కోరుతామని చెప్పారు.

రాత్రివేళ అత్యవసరమైతేనే బయటకు రావాలి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాల చోరీ, గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిఘా పెంచామని, రాత్రివేళ అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని ఎస్సై రవీంద్ర సూచించారు. దొంగతనాలు జరగకుండా రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రాత్రి 11 గంటల తర్వాత ఎవరైనా రోడ్డు మీద కనిపిస్తే, పోలీసు స్టేషన్‌కు తరలించి బైండోవర్ చేస్తామని చెప్పారు.

రహదారిపై గండితో రాకపోకలకు ఇబ్బంది

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: వాతంగి-ఓగిపాలెం గ్రామాల మధ్య బీటీ రహదారిపై పడిన గండి పూడ్చాలని, ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మించాలని లోదొడ్డి సర్పంచి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు కోరారు. గండి కారణంగా రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఈ మేరకు రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ కార్యాలయ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందజేశారు.


రహదారిపై పడిన గండి

అధ్వాన రోడ్లతో అవస్థలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లు పూర్తిగా శిథిలమై రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదివాసీల చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మడిగుంట వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం సంఘం తరపున కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మారేడుమిల్లి-పాతకోట, పందిరిమామిడి-చవిటిదిబ్బలు, జడ్డంగి-లోదొడ్డి, కాకవాడ-కొయ్యలగూడెం రహదారులు పూర్తిగా శిథిలమయ్యాయన్నారు. మన్యంలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

నీడ కరవై ప్రయాణికుల అవస్థలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు చాలా ఇబ్బందిపడుతున్నారు. పోలీసు స్టేషన్ ముందు ఉన్న బస్ షెల్టర్ కొన్ని సంవత్సరాల కితం తొలగించారు. అప్పట్నుంచి స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణమే బస్ షెల్టర్‌గా మారింది. ఇటీవల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆ ప్రాంతాన్ని తొలగించారు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

రహదారి ఛిద్రం

ముంచంగిపుట్టు: కిలగాడ కూడలి నుంచి దారెల పంచాయతీలోని 14 గ్రామాలకు చెందిన రహదారి ఛిద్రమైంది. వర్షాలకు గుంతలు ఏర్పడి, మట్టిరోడ్డును తలపిస్తోంది. పదేళ్ల కిందట నిర్మించిన రహదారికి కనీస మరమ్మతులు చేపట్టలేదు. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కిలగాడ కూడలి- దారెల రోడ్డు

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో 1/70 అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. పద్మాపురం పంచాయతీలో ఆయన పర్యటించి అక్రమ నిర్మాణాలపై ఆరాతీశారు. అంతకు ముందు ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించి సాధారణ వైద్య పరీక్షలు చేసుకున్నారు. సర్పంచి సుస్మిత, ఈఓ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం నేడు

దేవీపట్నం: ఇందుకూరుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జన సైనికులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి అగర్వాల్ కంటి ఆసుపత్రి, శ్రీ సాయిరామ్ డెంటల్, మోహన్ డయాబెటిక్, హెలియోస్ ఆసుపత్రి, స్త్రీల సంబంధిత వైద్యులు ఉచితంగా రోగులకు సేవలు అందించనున్నారని తెలిపారు. పోలవరం నిర్వాసితులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్డ్	187	206
స్కిన్‌లెస్	213	216

పర్యటక ప్రదేశాల్లో రక్షణ చర్యలు : కలెక్టర్


విద్యార్థులు గల్లంతైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మన్యంలోని పర్యటక ప్రదేశాలపై సందర్శకులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు వారి రక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మారేడుమిల్లిలోని 'జలతరంగిణి' జలపాతాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గతనెల 22న ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ జలపాతంలో పడి మృతిచెందారు. ఇదే ఘటనలో గల్లంతైన వైద్య విద్యార్థి సీహెచ్. హరదీప్ (20) ఆచూకీ ఇప్పటికీ లభించకపోవడంతో గాలింపు చర్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో సంఘటన జరిగిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. జిల్లా అటవీశాఖ అధికారిణి బబితతో మాట్లాడి ఇంతవరకు చేపట్టిన గాలింపు చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంతకాలంపాటు పర్యటక ప్రదేశాలను మూసివేయాలని ఆదేశించారు. ఈ ప్రదేశాల్లో పూర్తి రక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రమాదకర ప్రాంతాలను రెడ్, ఎల్లో జోన్‌లుగా విభజించి, తగిన సూచికలను ఏర్పాటు చేయాలని, ఆయా ప్రదేశాల్లో అత్యవసర విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక గిరిజన యువతకు తగిన శిక్షణ ఇచ్చి రక్షక దళాలుగా నియమించి, వారికి అవసరమైన సామగ్రిని సమకూర్చాలని చెప్పారు. అన్ని ప్రదేశాల్లోనూ అత్యవసర వైద్య సేవలతోపాటు సమాచార వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏజెన్సీకి వచ్చే పర్యటకులు మధురానుభూతులు మిగుల్చుకుని, సురక్షితంగా తిరిగి వెళ్లేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, సబ్ డీఎఫ్‌ఓ శ్రీవాణి, రేంజి అధికారులు కరుణాకర్, ఎంపీడీఓ వీరకిశోర్, తహసీల్దారు సుబ్బారావు, సీఐ గోపాలకృష్ణ, ఎస్సై సాయికుమార్, వీరబాబు పాల్గొన్నారు.

● మారేడుమిల్లిలోని బెయోర్షెబా చర్చివీధికి గతం నుంచి ఉన్న దారిని మూసేసి అటవీశాఖ అడ్డంగా గోడ కట్టిందని, దీంతో చుట్టుతిరిగి రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ పీఓ సింహాచలంకు ఆయన సూచించారు.

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

వసతిగృహాల్లో యోగాభ్యాసం

● వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ ● ఐటీడీఏ పీవో ప్రత్యేక చొరవ


గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆసనాలు

విద్యార్థులతో సూర్యనమస్కారాలు

మన్యంలో పాఠశాలలు

★ఆశ్రమ	: 118
★గురుకులాలు	: 18
★ఏకలవ్య	: 11
★కేజీబీవీ	: 11

వసతిగృహ విద్యార్థులు: 50 వేలకుపైగా


గిరిజన ప్రాంతంలో ప్రతికూల పరిస్థితుల నడుమ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వీరిలో వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న వారే ఎక్కువగా ఉంటున్నారు. ఏటా వైరల్ జ్వరాలు ప్రబలి పరిస్థితి విషమించి పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ చొరవ చూపారు. అనారోగ్య సమస్యలతోపాటు చదువులో ఒత్తిడిని దూరం చేసి మానసికోల్లాసం పెంపొందించేందుకు యోగా తరగతులను ప్రారంభించారు.

పదకొండు మండలాల్లో..

ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. పరిసరాల శుభ్రత పాటించకపోవడం, వాతావరణంలో మార్పులు, పారిశుద్ధ్య లోపించడం వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఎప్పటికప్పుడు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య, రక్త పరీక్షలు నిర్వహిస్తూ మందులు ఇస్తున్నా పరిస్థితులు అదుపులోకి రావడం లేదు. విద్యార్థులకు పోషకాహారం అందించడంతోపాటు ఒత్తిడిని దూరం చేస్తేనే ఫలితం ఉంటుందని ఐటీడీఏ పీఓ ఆలోచించారు. ప్రణవ సంకల్ప యోగా సమితి ప్రతినిధులతో మాట్లాడి విద్యార్థులకు సూర్య నమస్కారాలు నేర్పించారు. వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ సంస్థ ప్రతినిధి పతంజలి శ్రీనివాస్‌తో శిక్షణ ఇప్పించారు. పాడేరు ఏజెన్సీలోని పదకొండు మండలాల్లో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులతో యోగా సాధన చేయించనున్నారు. గుత్తులపుట్టు, శ్రీకృష్ణపురం, తలారిసింగి ఆశ్రమోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సూర్య నమస్కారాలు, యోగాలో ప్రతిరోజూ శిక్షణ ఇస్తున్నారు. ధ్యానంతోపాటు నైతిక విలువలపై అవగాహన కల్పిస్తున్నారు.

నిత్య యోగాతో ఆత్మస్థైర్యం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఆత్మస్థైర్యం పెరుగుతుందని యోగా గురువు పతంజలి శ్రీనివాస్ చెప్పారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న యోగా శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పాడేరులోని గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో 440 మంది విద్యార్థులతో సూర్య నమస్కారాలు, యోగాసనాలు వేయించారు. 'ప్రస్తుతం ఎంపిక చేసిన పాఠశాలల్లో యోగా తరగతులు నిర్వహిస్తున్నాం. వ్యాయామ ఉపాధ్యాయులకు మెలకువలు నేర్పుతున్నాం. భవిష్యత్తులో అన్ని వసతి గృహాలకు విస్తరిస్తామని శ్రీనివాస్ చెప్పారు. ప్రధానోపాధ్యాయులు జీవీప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు పాల్గొన్నారు.


విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న శ్రీనివాస్

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

రంపచోడవరం, న్యూస్‌టుడే: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమం ముగింపు సందర్భంగా మంగళవారం ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డీవో కొండలరావు తదితరులు రోడ్డు వెంబడి చెత్త, చెదారాలను తొలగించారు. అంబేడ్కర్ కూడలిలో విద్యార్థులతో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులంతా ప్రతి శుక్రవారం స్వచ్ఛభారత్ నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ ఉపేంద్రుడు, డీఎల్‌డీఓ కేదేశ్వరరావు, ఈఈ ఆర్‌డీ జానీమైల్లా పాల్గొన్నారు.

ఎటపాక, మారేడుమిల్లి, వై.రామవరం: ఎటపాక మండల పరిషత్ కార్యాలయం, వైద్యశాల, సచివాలయ పరిసరాల్లో స్వచ్ఛతే సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ కామేశ్వరి, ఎంపీడీఓ రామాంజనేయ ప్రసాద్ పరిసరాల్లోని ముళ్ల చెట్లు, పొదలను తొలగించారు. ఎంఈవో రాజులు, ఈవోపీఆర్డీ గంగరాజు, ఏపీఓ రామయ్యా పాల్గొన్నారు. మారేడుమిల్లి ఎంపీడీఓ వీరకిశోర్ తదితరులు ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో తుప్పలు, ముళ్లపొదలు తొలగించారు. వై.రామవరంలో ఎంపీడీఓ బాపన్నదొర మాట్లాడుతూ స్వచ్ఛతే సేవ స్ఫూర్తిని మారుమూల పల్లెలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

అందరి భాగస్వామ్యం తప్పనిసరి

పాడేరు, న్యూస్‌టుడే: స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో అందరి భాగస్వామ్యం తప్పనిసరి కావాలని జేసీ అభిషేక్ గౌడ కోరారు. కలెక్టరేట్ వద్ద అధికారులు, సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. వారానికి రెండు గంటల చొప్పున ఏడాదిలో వంద గంటలు శ్రమదానం చేయాలన్నారు. సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్ఓ పద్మావతి పాల్గొన్నారు.


కొత్తభల్లుగుడ పాఠశాలలో వ్యర్థాలను సేకరిస్తున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది

ఐటీడీఏ కార్యాలయం పరిసరాల్లో ఏపీఓలు ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, డీఎల్‌పీఓ కుమార్ శ్రమదానం చేశారు.

చింతపల్లి గ్రామీణం, గూడెంకొత్తవీధి: గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుకు ప్రజలంతా సహకారం అందించాలని ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దారు రామకృష్ణ కోరారు. చింతపల్లిలో వీధులతోపాటు ఆర్టీసీ బస్టాండ్, రెవెన్యూ, మండల పరిషత్తు కార్యాలయం వద్ద స్వచ్ఛతే సేవ నిర్వహించారు. గూడెంకొత్తవీధి ఎంపీడీఓ కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, అధికారులు, సిబ్బంది కార్యాలయాల పరిసరాల్లో తుప్పలను తొలగించారు.

అరకులోయ పట్టణం, ముంచంగిపుట్టు: అరకులోయలో పంచాయతీ, డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో తుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. కొత్తభల్లుగుడ, అరకు పాఠశాలలో స్వచ్ఛత సేవ కార్యక్రమాలు కొనసాగాయి. ముంచంగిపుట్టులోని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛతే సేవ నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పాడేరు ఐటీడీఏ ప్రాంగణంలో..


చింతపల్లి బస్టాండులో..

2246 కేంద్రాల స్థాయి పెంపునకు ప్రతిపాదనలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: విశాఖ రీజియన్‌లో 2,246 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా స్థాయి పెంచాలని ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి పంపినట్లు శిశు సంక్షేమ శాఖ ఆర్డీడీ చిన్మయాదేవి చెప్పారు. కొయ్యూరులో మంగళవారం 12 మంది గర్భిణులకు సీమంతం, 6 చిన్నారికి అన్నప్రాశన చేశారు. 21 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, సీడీపీవో విజయకుమారికి అవార్డులు అందజేశారు. విశాఖ రీజియన్‌లోని 280 కేంద్రాల్లో మొదటి విడతగా ఐదు రకాల వసతులు కల్పించనున్నాం. 1300 కేంద్రాల్లో దశలవారీగా కల్పిస్తామన్నారు. కిశోర్ వికాస్ పేరుతో బాలికలకు ట్రైనింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.


సీడీపీవో విజయకుమారికి అవార్డు అందజేస్తున్న ఆర్డీడీ చిన్మయాదేవి

సంపూర్ణ పోషణపై మహిళలకు అవగాహన

చింతపల్లి, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మహిళలకు సంపూర్ణ పోషణపై అవగాహన కల్పించాలని ఆర్డీడీ చిన్మయాదేవి సూచించారు. పోషకాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటైన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం పోషకాహార ప్రదర్శనను తిలకించారు. తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీఓ ఆశాజ్యోతి, సర్పంచి పుష్పలత, సీడీపీఓ రమణి, వైస్ ఎంపీపీ శారద, ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి, దారలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


చింతపల్లిలో ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పేదల ఇళ్ల కూల్చివేత యత్నం దుర్మార్గం

ఎటపాక, న్యూస్‌టుడే: పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీ శ్రీరామ్‌నగర్ కాలనీలోని ఆదివాసీ ఇళ్లను కూల్చివేసే ప్రయత్నాన్ని భద్రాచలం దేవస్థానం అధికారులు వెంటనే మానుకోవాలని సీపీఐ (ఎంఎల్-మాస్‌లైన్) రాష్ట్ర నాయకులు కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఎటపాకలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలోని ఖాళీగా ఉన్న దేవస్థాన భూముల్లో గుడిసెలు వేసుకుని సుమారు 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఉన్నట్టుండి దేవస్థానం అధికారులు వచ్చి ఇళ్లను కూల్చివేస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఆదివాసీల రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివిజన్ నాయకులు సాయన్న, శివ ప్రశాంత్, వేణు, నర్సింహారావు, చంద్రకళ, సరోజిని, పార్వతి, వెంకమ్మ, మల్లయ్య, రాజు, రాజేష్, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం సిబ్బంది నిరసన

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణం సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అరుకులో నిరసన వ్యక్తం చేశారు. వీటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమ కుటుంబాలు వీధిన పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారన్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

మురిపించిన ముందస్తు దసరా సంబరాలు


సీలేరు డీఏవీ పాఠశాలలో వివిధ వేషధారణల్లో విద్యార్థులు

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం ఏపీ జెన్‌కో ఉన్నత, డొంకరాయి ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ముందస్తు దసరా సంబరాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులంతా సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా సీలేరు విద్యుత్తు కాంప్లెక్స్ ముఖ్య ఇంజినీరు వాసుదేవరావు హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు మట్టితో తయారు చేసిన దుర్గాదేవి విగ్రహానికి పూజలు చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు నవదుర్గల నృత్య రూపకం ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం నవరాత్రుల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ముఖ్య ఇంజినీరు వాసుదేవరావు రావణ దహనం చేశారు.

సీలేరు, న్యూస్‌టుడే: జెన్‌కో డీఏవీ పాఠశాలలో మంగళవారం ముందస్తుగా దసరా సంబరాలు నిర్వహించారు. అమ్మవారి దశావతారాల వేషధారణలో విద్యార్థినులు అలరించారు. గాంధీ జయంతి సందర్భంగా పలువురు విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. సీలేరులో మంగళవారం సాయంత్రం గరగాలంకరణ కార్యక్రమం కనులపండువగా జరిగింది.


మోతుగూడెం డీఏవీ ఉన్నత పాఠశాలలో నవదుర్గల వేషధారణలో బాలికలు

మండప సామగ్రి వితరణ

కూనవరం: శరన్నవరాత్రి ఉత్సవాల పందిరి కోసం దూగుట్ట యువతకు రూ. 16 వేల సామగ్రిని జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు నుంచి వితరణగా అందించింది. పందిరికి కావాల్సిన రేకులు, పైపులు అందజేసినట్లు జమాల్‌ఖాన్ తెలిపారు. సూఫి, రసూల్, ప్రేమ్‌చంద్, సాయికిరణ్, చందు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పించన్లతో ఆర్థిక భరోసా


కొత్తూరులో పింఛన్ పంపిణీ చేసిన మాజీ మంత్రి కిడారి

రంపచోడవరం, మారేడుమిల్లి, వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పేద, బడుగు, మధ్య తరగతి, పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మారేడుమిల్లి దొరలవీధిలో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. పింఛనుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పింఛను సొమ్ముతో కుటుంబాలను పోషించుకుంటున్నామని మహిళలు తెలిపారు. ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఎంపీడీఓ వీరకిశోర్, తహసీల్దారు సుబ్బారావు, సర్పంచి జాకబ్, ఉప సర్పంచి వీరబాబు, ఉప ఎంపీపీ రవికుమార్ పాల్గొన్నారు.

● రంపచోడవరం మార్కెట్, శివాలయం, వాల్మీకిపేట, రెడ్డిపేటలో తెదేపా నాయకులు పించన్ల పంపిణీలో పాల్గొన్నారు. అడబాల బాపిరాజు, ఇబ్రహీం, సురేష్, వెంకన్న, సత్య, భూచక్రం, జనార్దన్ పాల్గొన్నారు. పుల్లంగి పంచాయతీ అడ్డరివలస, చెలకవీధి గ్రామాల్లో సర్పంచి జార్జిబాబు, కార్యదర్శి కిశోర్, దొరచింతలపాలెం పంచాయతీ పరిధిలోని శ్రీపురం, దొరచింతలపాలెం గ్రామాల్లో తెదేపా నాయకులు బషీర్, ప్రణీత్, గోపి, అభిరామ్, కామరాజు, మారేడుమిల్లి అడ్డరవీధిలో ఐ-టీడీపీ మండల సమన్వయకర్త రాంబాబు పించన్లు పంపిణీ చేశారు. వరరామచంద్రాపురం మండలంలోని మూడు వేల మందికిపైగా పింఛనుదారులకు అధికారులు, తెదేపా నాయకులు వేకువజాము నుంచే పింఛన్లు అందజేశారు. వరరామచంద్రాపురం బీసీ కాలనీకి చెందిన కిడ్నీ బాధితుడు కోట్ల షిరిడీ సాయిబాబుకు చాలా రోజులుగా పింఛన్ మంజూరు రావడం లేదు. ఈ విషయాన్ని స్థానిక నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆయనకు ఈనెల పింఛను మంజూరైంది. రూ. 10 వేల పింఛనును జడ్పీటీసీ సభ్యుడు రంగారెడ్డి, నరేశ్, రామారావు, నరసింహారావు బాధితుడికి అందజేశారు.

గంగవరం, ఎటపాక: గంగవరం మండల ప్రజా ప్రతినిధులు, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, తెదేపా మండల అధ్యక్షుడు అర్జున్, ఎటపాక మండలంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.

సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం

అనంతగిరి గ్రామీణం, చింతపల్లి: ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. కొత్తూరు పంచాయతీ కేంద్రంలో తెదేపా మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. డుంబ్రిగుడలో తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత లబ్ధిదారులకు పింఛను నగదు అందజేశారు.


శ్రీపురంలో నగదు ఇస్తున్న తెదేపా నాయకులు


మారేడుమిల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

తొలిరోజే 95 శాతం పంపిణీ

పాడేరు, న్యూస్‌టుడే: అక్టోబర్ నెలకు సబంధించిన ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు జిల్లా వ్యాప్తంగా 95.76 శాతం పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆరు గంటలకే గ్రామల్లో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటా వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,24,778 మంది లబ్ధిదారులకు రూ.52 కోట్లు పింఛన్లు విడులైంది. అత్యధికంగా హుకుంపేట 97.81 శాతం, గంగవరం 97.64. మారేడిమిల్లి 97.71, మిగిలిన అన్ని మండలాలల్లో 96 శాతం పైబడి పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 8 గంటల వరకు 1,24,778మందిలో 119482 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు కలెక్టర్ వివరించారు.

చింతపల్లి గ్రామీణం, జి.మాడుగుల, గూడెంకొత్తవీధి: చింతపల్లి మండలంలో పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తయిందని ఎంపీడీవో ఆశాజ్యోతి చెప్పారు. చౌడుపల్లిలో సచివాలయ్య సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. జి.మాడుగుల మండలంలో 91.5 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లోహిత్ జయసాగర్ చెప్పారు. గూడెంకొత్తవీధిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం వేకువజాము నుంచే ప్రారంభమైంది. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు గూడెంకొత్తవీధి, పూజారిపాకలు గ్రామాల్లో ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. రింతాడ, ఏబులం, ఆర్వీనగర్ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. సాయంత్రానికి 95 శాతం పంపిణీ పూర్తయిందని చెప్పారు.

కార్మికుల సంక్షేమబోర్డును పునరుద్ధరించాలి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు 12 రకాల సంక్షేమ పథకాలను అందజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. అరకులోయలో మండల భవన నిర్మాణ రంగ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. జగన్ ప్రభుత్వం 12 రకాల పథకాలను అమలు చేయకుండా కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు గోవింద్, కొండబాబు, ప్రభుదాస్, సత్తిబాబు, సోమినాయుడు పాల్గొన్నారు.

కాఫీబోర్డు ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: కాఫీ బోర్డు రైతుల పిల్లలకు అందిస్తున్న ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చలపతిరావు అన్నారు. అంతర్జాతీయ కాఫీ డేను అరకులోయ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జూనియర్ లైజన్ అధికారి వీవీకే లక్ష్మి, ఏఈఓ రవికుమార్, ఈఐ రవి, వాల్‌మార్ట్ టెక్నోసర్వ్ శ్రీనివాసరావు, బోర్డు కార్యాలయం పాల్గొన్నారు. అరకులోయ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ భరత్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో కాఫీ డేను నిర్వహించారు.

స్వచ్ఛభారత్‌పై నాటకం


మూలపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛతే సేవ, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు మంగళవారం వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు జరిగాయి. విజేతలకు ప్రిన్సిపల్ కృష్ణ బహుమతులు అందజేశారు. మూలపేట గ్రామంలో విద్యార్థినులు స్వచ్ఛభారత్ అంశంపై నాటకం వేశారు. అనంతరం స్థానికులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. వైస్ ప్రిన్సిపల్ మహాలక్ష్మి, అధ్యాపకులు మంగమ్మ, కుమారి, శ్రీవిద్య, రాజుబాబు, పుష్ప, శేఖర్, భవన, సౌమిత్రి పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ దీక్ష

పాడేరు, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను ఆపాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఐటీడీఏ కార్యాలయం ఎదుట మంగళవారం దీక్ష చేపట్టారు. ప్రైవేటీకరణతో ఉద్యోగ అవకాశాలు కోల్పోతామన్నారు. ఏఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, అశోక్, కార్తిక్, శ్రీను, చిన్నారావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా దీక్షలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు


ఆర్వీనగర్‌లో కాఫీ ఉత్పత్తుల ప్రదర్శనను సందర్శించిన స్థానికులు

సేంద్రియ ఎరువులతో భూసారం వృద్ధి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం వృద్ధి చెందుతుందని, తద్వారా దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయ సహాయ సంచాలకురాలు జాహ్నవి చెప్పారు. చౌడుపల్లి, పశువులబంద గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: పంటల సాగుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి సూచించారు. జి.అద్దరవీధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో చింతపల్లి వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త బాలహుసేన్‌రెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు రమేష్, జనసేన మండల కన్వీనర్ సిద్దార్థమార్క్, ఎంపీటీసీ పూర్వ సభ్యుడు ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

కాఫీ సాగు ద్వారా గిరిజన రైతులకు అంతర్జాతీయంగా గుర్తింపు వస్తోందని ప్రాంతీయ కాఫీ పరిశోధనా స్థానం కార్యనిర్వహణాధికారి సునీల్‌బాబు చెప్పారు. ఆర్వీనగర్‌లోని కాఫీ బోర్డు కార్యాలయంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. భూసార శాస్త్రవేత్త రాజా భూపతి, జేఎల్‌ఓ నరేష్, ఏఈవో శ్రీనివాసరావు, సౌమ్య పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించాలని ఏఓ శ్రీనివాసబాబు అన్నారు. దారెల పంచాయతీ పెదపేట, బాబుసాల పంచాయతీలోని కాంద్రంగివలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు.

అడ్డతీగల: రైతులు వ్యవసాయ పనుల్లో ఆధునిక పద్ధతులు పాటిస్తే లాభాలు వస్తాయని వ్యవసాయాధికారి సువర్ణ కుమారి అన్నారు. అనిగేరు గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: మండలంలో సిరిగిందలపాడు నుంచి జాగరంపల్లి వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గుంతలుపడ్డాయి. దీంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారినపడుతున్నారు.

– కె.రాంబాబు, ఇర్లపల్లి

✓: ప్రధాన రహదారిలో పడిన గుంతలకు త్వరలో మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతాం.

– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, రంపచోడవరం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లి మండల విద్యా వనరుల కేంద్రం ప్రాంగణం భారీ వర్షాలకు బురదమయంగా మారింది. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– శివప్రసాద్, మారేడుమిల్లి

✓: విద్యా వనరుల కేంద్రం పరిసరాల్లో బురద నిలవకుండా చర్యలు తీసుకుంటాం.

– వీరకిశోర్, ఎంపీడీఓ, మారేడుమిల్లి

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం

రంపచోడవరం, న్యూస్‌టుడే: పెదగెద్దాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జర్తా నాగమణిని పాఠశాల కమిటీ ఛైర్మన్ టి.వీరబాబు, కోండ్ల పుష్పలత ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల నాగమణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పాడేరులో కలెక్టర్ దినేష్‌కుమార్ చేతులమీదుగా అవార్డు అందుకొన్నారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి ఆమె అందించిన సేవలను కొనియాడారు. స్థానిక సర్పంచి వడగల ప్రసాద్, పాఠశాల స్థలదాత కడబాల అబ్బాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బందికి వీడ్కోలు

ఎటపాక, న్యూస్‌టుడే: స్థానిక వెలుగు కార్యాలయంలో పనిచేస్తూ, బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న సిబ్బందికి మంగళవారం వీపీఓలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఏపీఎం స్వామి మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని శాఖల వారితో సమన్వయం చేసుకొంటూ పనిచేశామని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు కృష్ణవేణి, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.